సాక్షి
అనకాపల్లి
శనివారం । 20 । జూలై । 2024



శాకంబరిగా ఉమామహేశ్వరి

దేవరాపల్లి: స్థానిక ఉమామహేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని పలు రకాల కాయగూరలతో శుక్రవారం శాకంబరిగా అలంకరించారు.



అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.



ఐఆర్‌సీటీసీ టూర్ ప్యాకేజీలు

ఉత్తరాంధ్ర జిల్లాల వారి కోసం విశాఖ నుంచి పలు అంతర్జాతీయ, జాతీయ విమాన ప్యాకేజీలను ఐఆర్‌సీటీసీ ప్రారంభించింది. 8లో

దంచికొట్టిన వర్షం


అనకాపల్లి మండలం శంకరంలో నీట మునిగిన వరి నారు మడులు


నీట మునిగిన అనకాపల్లి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్

- స్తంభించిన జనజీవనం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగిపొర్లిన గెడ్డలు, వాగులు
- రహదారులపై చేరిన వర్షపునీరు
- కళకళలాడుతున్న రిజర్వాయర్లు
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

సాక్షి, అనకాపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. కొన్నిచోట్ల రహదారులపై నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఫుట్‌పాత్, వీధి, చిరువ్యాపారులు ఇళ్లకే పరిమితమయ్యారు. స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించడంతో సమీప గ్రామాల నుంచి అనకాపల్లి పట్టణానికి చేరుకున్న కొంతమంది విద్యార్థులు ఇళ్లకు తిరుగుపయనమయ్యారు. జనంలేక మార్కెట్లు వెలవెలబోయాయి. అనకాపల్లిలో ప్రధాన రహదారి, రైల్వే స్టేషన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లు నిర్మానుష్యంగా కనిపించాయి.

సాగుకు మేలు..

కొన్నాళ్లుగా సరైన వర్షాలు లేక, పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కురిసిన వర్షాలతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షాలు వ్యవసాయానికి మేలు చేస్తాయని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి నారు మడుల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపేందుకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని పంట భూముల్లో వర్షం నీరు అధికంగా చేరడంతో అవన్ని చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు భూముల్లో వరినాట్లు మాత్రం ముంపునకు గురవుతున్నాయి.

అధికార యంత్రాంగం అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ విజయ కృష్ణన్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల తహసీల్దార్లతో శుక్రవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో 24 గంటలు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 24 మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 24గంటలు పనిచేసే విధంగా రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఈకంట్రోల్ రూమ్‌ల్లో నియమించారు.

నిండుగా రిజర్వాయర్లు

జిల్లాలో రైవాడ, పెద్దేరు, కళ్యాణపులోవ రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయి. రైవాడ జలాశయంలో గరిష్ట నీటి మట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 106.30 మీటర్ల నీటిమట్టం ఉంది. తెన్నేటి విశ్వనాథం పెద్దేరు రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.35 మీటర్ల నీటి మట్టం ఉంది. కళ్యాణపులోవ రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 460 మీటర్లు అయితే ప్రస్తుత నీటి మట్టం 459 మీటర్లు ఉంది.

ఉధృతంగా గెడ్డలు, వాగులు

భారీ వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలు, కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గెడ్డల్లో వరదనీరు పోటెత్తడంతో సమీప గ్రామాల ప్రజలను రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం చేసింది. జిల్లాలోని అన్ని చెరువులు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి.

కంట్రోల్ రూం ఏర్పాటు..


కాల్‌సెంటర్‌లో అందుబాటులో ఉన్న సిబ్బంది

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను కలెక్టర్ ఏర్పాటు చేశారు. సీనియర్ అసిస్టెంట్ కె.కె.జగజ్జీవన రావు(ఫోన్ 8074480904), జూనియర్ అసిస్టెంట్ జి.సత్యనారాయణ(ఫోన్ నంబర్ 9494933838) 24 గంటలూ అందుబాటులో ఉంటారు.


రాంబిల్లి మండలం వాడపాలెం వద్ద ఎగసిపడుతున్న సముద్రం అలలు

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లా వ్యాప్తంగా 36.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అనకాపల్లి మండలంలో ఎరుకువానిపాలెంలో 75.75 మిల్లీమీటర్ల, యలమంచిలి కొక్కిరాపల్లిలో 49.5, కోడూరులో 43.75, కోటవురట్ల మండలం కైలాపట్నంలో 32.5, ఎస్.రాయవరం మండలం కొరుప్రోలులో 31.5, నక్కపల్లి మండలం వేంపాడులో 28, నర్సీపట్నం మండలం బలిఘట్టంలో 27.25, రావికమతం మండలం కొత్తకోటలో 23.75 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదు కాగా..అత్యల్పంగా నర్సీపట్నం పెదబొడ్డేపల్లిలో 0.25 మిల్లీమీటర్లు, అచ్యుతాపురంలో 9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రమాద స్థాయికి ‘పెద్దేరు’

- పెరుగుతున్న నీటి మట్టం
- స్పిల్ వే గేట్ల ద్వారా 200 క్యూసెక్కులు విడుదల


పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పెద్దేరు జలాశయం నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరింది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, శుక్రవారం సాయంత్రానికి 136.35 మీటర్లకు చేరింది. జలాశయం పరిసరాల్లో 14 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జలాశయంలోకి 188 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని, పెరుగుతున్న నీటి మట్టానికి అనుగుణంగా జలాశయం నుంచి 200 క్యూసెక్కుల నీటిని శుక్రవారం రాత్రి స్పిల్ వే గేట్ల ద్వారా విడుదల చేశామని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

జలాశయం ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ మేరకు రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సమాచారం అందించామన్నారు. జలాశయం దిగువన గల గెడ్డలు, వాగుల్లో ఎవరూ దిగరాదని ఆయన తెలిపారు.

రైవాడలోకి 500 క్యూసెక్కులు...

దేవరాపల్లి: అల్పపీడన ప్రభావంతో దేవరాపల్లిలో రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. ఈ వర్షంతో రైవాడ జలాశయంలోకి 500 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 106.30 మీటర్లకు చేరుకుంది.

న్యూస్‌రీల్

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు పూర్తిస్థాయిలో సహకారం

- కలెక్టర్ విజయ కృష్ణన్



తుమ్మపాల: రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవసరమైన అనుమతులు, సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎప్పుడూ ముందు ఉంటుందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో రైతులు పండించే పంటలు, మార్కెటింగ్, స్టోరేజ్ అవకాశాల గురించి చర్చించారు. పంటను డైరెక్టుగా అమ్ముకునే విధానం వల్ల రైతులకే మేలు జరుగుతుందని తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అధిక లాభాలు వచ్చే విధంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. దళారీ వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాబార్డ్, హార్టికల్చర్, అగ్రికల్చరల్, డీఆర్‌డీఏ, ఫిషరీస్ శాఖల అధికారులు, ఎల్‌డీఎం, వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవాలయాలకు రూ.1.80 లక్షల విరాళం


మోదకొండమ్మ ఆలయానికి చెక్కు అందజేస్తున్న శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులు

మాడుగుల: మండల కేంద్రం మాడుగులలో గల మూడు దేవాలయాలకు బెంగళూరులో నివాసముంటున్న కాంట్రాక్టర్ చెక్కా శ్రీరామ్మూర్తి రూ.1.80 లక్షలు విరాళంగా అందజేశారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి రూ 1.26 లక్షలు, మోదకొండమ్మ ఆలయానికి రూ.27 వేలు, షిర్డీ సాయిబాబా ఆలయానికి రూ.27 వేల చొప్పున చెక్కులను వేర్వేరుగా శ్రీరామ్మూర్తి కుమారుడు చెక్కా వెంకటేశ్ శుక్రవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. విరాళాలు అందజేసిన దాతను ఆయా ఆలయాల్లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు పుట్టా గంగయ్య, స్థానిక వర్తకులు భవిరిశెట్టి వెంకటరావు, కొప్పాక దేవి ప్రసాదు, జల్లు లింగన్న, జల్లు సంజయ్, మండల సతీష్, గౌరీపట్టపు నగేష్, మాటూరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా మురళి



నర్సీపట్నం: చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా నర్సీపట్నానికి చెందిన పులిగా రామ్మోహన్ మురళి నియమితులయ్యారు. విజయనగరంలో జరిగిన సమితి రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ప్రకటించినట్టు మురళి తెలిపారు. ఈ కమిటీలో తనకు స్థానం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు జాగరపు ఈశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్య సింహాచక్రవర్తి, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడులకు ధన్యవాదాలు తెలిపారు. చెరువులను పరిరక్షించి రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

అప్పన్నా.. వస్తున్నాం..

- నేడు, రేపు గిరి, ఆలయ ప్రదక్షిణలు
- వర్షంలోను ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నం



వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేంజేసిన కొండచుట్టూ 32 కిలోమీటర్ల ప్రదక్షిణ చేసే సమయం వచ్చింది. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం గిరి ప్రదక్షిణ ఉత్సవం జరగనుంది. ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేశారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులు ఉత్సాహంతో గిరి ప్రదక్షిణకు సిద్ధమవుతున్నారు. 8లో

ఒకే ఒక అడుగు

- వర్షాలకు 'తాండవ'లోకి కొద్దిపాటిగా చేరిన నీరు


తాండవ ప్రాజెక్టు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్టు డీఈ అనురాధ, తహసీల్దార్ రమేష్‌కుమార్

నాతవరం: జిల్లా వ్యాప్తంగా జోరుగా వర్షాలు పడుతున్నా తాండవ రిజర్వాయర్‌లోకి ఆశించిన విధంగా నీరు చేరలేదని, కేవలం ఒక్క అడుగు మాత్రమే నీటి మట్టం పెరిగిందని తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్‌తో పాటు డీఈ అనురాధ తాండవ రిజర్వాయర్‌ను శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టులో నీటి నిల్వలను పరిశీలించి ఇన్‌ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. అనంతరం ప్రాజెక్టు డీఈ మాట్లాడుతూ తాండవ రిజర్వాయర్‌లో గురువారం ఉదయానికి 363.8 అడుగుల నీరు ఉండగా శుక్రవారం ఉదయానికి 364.8 అడుగులకు చేరిందన్నారు. అల్లూరి జిల్లా కొయ్యూరు, చింతపల్లి తదితర మండలాల్లో కొండలపై అధికంగా వర్షాలు కురిసి, గెడ్డలు పొంగి ప్రవహిస్తేనే ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతుందని చెప్పారు. వర్షాలు ఇలాగే కురిస్తే శనివారం ఉదయానికి ప్రాజెక్టులో నీటి మట్టం కాస్తా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తిస్థాయికి పెరిగే అవకాశం లేదన్నారు. అయితే వర్షాలు తగ్గే వరకు ప్రాజెక్టు సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తారని చెప్పారు. ప్రస్తుతమున్న నీటి మట్టమే కొనసాగితే తాండవ నుంచి ఖరీఫ్ సాగుకు నీరు సరఫరా చేయలేమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణ నాతవరం సెక్షన్ జేఈ శ్యామ్‌కుమార్, ఆర్‌ఐ హరి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన


మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

నక్కపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాక్షస పాలన సాగుతోందని, రోజూ మారణహోమం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల రోజుల వ్యవధిలో జరిగిన హత్యలు, దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని చెప్పారు. టీడీపీ నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రోద్బలంతోనే ఈ మారణ కాండ జరుగుతోందన్నారు. లోకేష్ రాజ్యాంగం అమలు జరుగుతోందని చెప్పారు. కళ్లెదుటే నడిరోడ్డుపై నరికి చంపుతుంటే పోలీసులు చూస్తూ ప్రేక్షక పాత్ర వహిస్తున్నారన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీకి ఓటేశారన్న అక్కసుతోనే హత్యలుచేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో మహిళలకు రక్షణ లేదని, బాలికలపై లైంగికదాడులు విపరీతంగా జరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ మరో బిహార్‌గా మారుతోందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని తెలిపారు. హత్యలు, అత్యాచారాలపై కూటమి ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, హత్యలపై కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. మారణకాండను ఎదుర్కోవడం, కార్యకర్తలను కాపాడుకునే విషయంలో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తీసుకునే నిర్ణయాలకు తామంతా కట్టుబడి ఉంటామని, ఏ పోరాటం చేసినా ఆయన వెనుక ఉంటామని స్పష్టం చేశారు.

కోయంబత్తూర్-దానాపూర్ మధ్య వన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబత్తూర్-దానాపూర్‌మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. కోయంబత్తూర్-దానాపూర్ (06185) స్పెషల్ ఈ నెల 21వ తేదీ రాత్రి 11.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.15గంటలకు బయలుదేరి మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు దానాపూర్ వెళ్తుంది. ఈరైలు 15-స్లీపర్ క్లాస్, 2-సెకండ్ క్లాస్ లగేజీ కం దివ్యాంగ కోచ్‌లతో నడుస్తుంది.

ఆలస్యంగా సంత్రగచ్చి-బెంగళూరు స్పెషల్

సంత్రగచ్చిలో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు (08845) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయలుదేరింది.

టెక్నాలజీని అందిపుచ్చుకుంటేనే రాణింపు


సమావేశంలో మాట్లాడుతున్న చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అచ్యుతాపురం(యలమంచిలి): చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో సవాళ్లను అధిగమించేందుకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. అచ్యుతాపురం సెజ్ వద్దనున్న ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 15 ఎంఎస్ఎంఈ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో ఒకటి అచ్యుతాపురం సెజ్‌లో ప్రారంభించినట్లు గుర్తు చేశారు. 2 వేల మందితో ప్రారంభమైన శిక్షణ కేంద్రంలో ప్రస్తుతం 3 వేల మంది శిక్షణ పొందుతున్నట్లు పేర్కొన్నారు. దీన్ని 5 వేల మందికి శిక్షణ ఇచ్చే స్థాయికి పెంచేందుకు ప్రతిపాదన చేస్తున్నట్లు వెల్లడించారు. కనీస విద్యార్హత 8వ తరగతి నుంచి ఎంటెక్ చదివిన వారు కూడా ఈ కేంద్రంలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ శిక్షణ కేంద్రంలో ప్రభుత్వం కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. ఈ శిక్షణ కేంద్రాలకు కొనసాగింపుగా జిల్లాకి ఒకటి చొప్పున శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. మంత్రిని సెంటర్ ప్రతినిధులు సత్కరించారు. అనకాపల్లి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, విశాఖ జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణపతి, అనకాపల్లి జిల్లా ఆటోనగర్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి నేతల మధ్య భూ చిచ్చు

- బీజేపీ సర్పంచ్ భూమిపై టీడీపీ నేత కన్ను
- ఎమ్మెల్యేను ఆశ్రయించిన మహిళా సర్పంచ్

అచ్యుతాపురం: టీడీపీ, జనసేన నేతల మధ్య ఆధిపత్య పోరులో బీజేపీ సానుభూతి మహిళా సర్పంచ్ ఇబ్బంది పడుతున్నారు. ఇరు పార్టీల నాయకులు తమ అధిష్టానాలకు ఫిర్యాదులు చేసుకుని, నియోజకవర్గంలో రాజకీయ రచ్చకు తెరలేపారు. దీనిపై తాజా ఎన్నికలకు ముందు బీజేపీలో చేరిన అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామ సర్పంచ్ అనురాధ శుక్రవారం మీడియాకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనురాధ అత్త పేరిట 1985 నుంచి 2.25 ఎకరాల భూమి ఉంది. ఇందులో నాలుగేళ్లుగా ఎలాంటి పంట సాగు లేదు. పక్కనే ఉన్న బంజరు భూమిని ఆసరాగా చేసుకుని పలువురు దుస్తులు ఉతుక్కునేవారు. తాజాగా ఈ భూమిని సాగులోకి తీసుకొచ్చేందుకు సర్పంచ్ కుటుంబీకులు వెళ్తే కొందరు అడ్డుకున్నారు. దీని వెనుక టీడీపీ నేత హస్తం ఉందని తెలుసుకున్న ఆమె స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు మొరపెట్టుకున్నారు. ఆయన సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కారానికి రంగంలోకి దిగారు. దీంతో సదరు టీడీపీ నేత ఒత్తిడి తీసుకొచ్చి, ఎమ్మెల్యేపై తమ ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేశారు. సుందరపు కూడా తమ పార్టీ అధినేతకు నివేదించారు. పరస్పర ఫిర్యాదులపై కూటమి పెద్దల నుంచి ఎటువంటి స్పందనా రాలేదు.. దీంతో తనకు అండగా నిలిచిన ఎమ్మెల్యేపై దుష్ప్రచారంతోపాటు, తనపై కూడా దూషణలకు దిగారని అనురాధ మీడియా ముందు వాపోయారు. ఈ విషయమై దర్యాప్తు జరిపి, తనకు న్యాయం చేయాలని కోరారు.

దీనిపై ఆర్‌ఐ కుమార్‌ను వివరణ కోరాగా రికార్డులు, పాస్ బుక్‌ల ఆధారంగా సదరు భూమి సర్పంచ్ కుటుంబీకుల పేరిటే ఉన్నట్లు స్పష్టం చేశారు. తమ భూమిలోకి తమను వెళ్లనీయకుండా కొందరు అడ్డుకుంటున్నారని సర్పంచ్ ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు సర్వే చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం సర్వే చేపట్టాల్సి ఉండగా, భారీ వర్షాల నేపథ్యంలో వెళ్లలేకపోయామన్నారు. త్వరలోనే సర్వే చేపట్టి, తహసీల్దార్‌కు నివేదించనున్నట్లు వెల్లడించారు.

అయితే భూమిలో సర్పంచ్ కుటుంబీకుల్ని అడ్డుకుంటున్న వారి వద్ద భూమికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని సమాచారం. క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారుల దర్యాప్తు తర్వాత స్పష్టతరానుంది.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

చోడవరం: ప్రత్యేక పూజలు, హోమాలతో చోడవరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రాచీన శివాలయాల్లో ఒకటైన స్వయంభూ గౌరీశ్వర స్వామివారి ఆలయం ప్రాంగణంలో మూడో రోజు గురువారం మహా చండీ రుద్ర హోమం, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సహస్ర లింగార్చన, విశేష అభిషేకం చేశారు. వేదపండితులు సామూహిక వేదమంత్రాల మధ్య మహా చండీ రుద్ర హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు, వేదపండితుడు కొడమంచిలి చలపతి రావు ఆధ్వర్యంలో ఇక్కడ ప్రత్యేక మండపంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత రాజు ప్రత్యేక పూజలు చేశారు.

త్వరితగతిన ప్రాజెక్టులు పూర్తి చేయాలి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చేపట్టిన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని మెట్రోపాలిటన్ కమిషనర్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మల్టీలెవెల్ కార్ పార్కింగ్, ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ వంతెన, ఎండాడ, భీమిలాపల్లిలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణ పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఈ ప్రాజెక్టుల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.

అప్పన్నా.. వస్తున్నాం..





సింహాచలం : సింహగిరి ప్రదక్షిణకు సమయం ఆసన్నమైంది. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేంజేసిన 32 కిలోమీటర్ల కొండచుట్టూ ప్రదక్షిణ చేసే సమయం వచ్చింది. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం గిరి ప్రదక్షిణ ఉత్సవం జరగనుంది. ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది వరకు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్టు జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం, రెవెన్యూ, జీవీఎంసీ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్, ఫైర్, ఎక్సైజ్ తదితరశాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేశారు. తుపాన్ కారణంగా ఏర్పాట్లకు అంతరాయం ఏర్పడినా భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆయా ఆశాఖ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఏర్పాట్లు ఇలా...

- గిరి ప్రదక్షిణ మార్గంలో 29 ప్రదేశాల్లో స్టాళ్లు ఏర్పాటు చేశారు. అక్కడ భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు.
- 22 ప్రదేశాల్లో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా 290 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
- 11 ప్రదేశాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.
- 12 ప్రదేశాల్లో 17 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు.
- ఆరు ప్రదేశాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు
- సింహాచలంలోని తొలిపావంచా వద్ద నుంచి శనివారం సాయంత్రం 4గంటలకు పుష్పరథం ప్రారంభమవుతుంది. రథంతో ప్రదక్షిణ ప్రారంభించే భక్తులు ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.
- ఉదయం నుంచే పలువురు భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించడం పరిపాటి. దీన్ని దృష్టిలో ఉదయం నుంచే తొలిపావంచా వద్ద భక్తులకు సేవలందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.
- సింహాచలంలోని స్వామివారి తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరి కాయలు కొట్టేందుకు 50 క్యూలైన్లు, 80 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు. అలాగే అడవివరం–హనుమంతవాక బీఆర్‌టీఎస్ మార్గంలో కొత్త ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద 20 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు.
- దారి పొడవునా భక్తులకు పలు స్వచ్ఛంధ సంస్థలుఆహార పదార్థాలు, పానియాలు, స్నాక్స్ అందించనున్నాయి.
- కొండచుట్టూ ఏర్పాటు చేసిన స్టాళ్లల్లో జీవీఎంసీ తాగునీరు అందిస్తుంది. అలాగే పారిశుధ్యం,మరుగుదొడ్ల నిర్వహణ చేస్తుంది.
- ఆదివారం కేవలం కొండపైకి వెళ్లే భక్తులను మాత్రమే సింహగిరి మెట్లమార్గంలో అనుమతిస్తారు. కొండదిగువకు అనుమతించరు. ఆరోజు ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొండదిగువకి వచ్చే భక్తులను దేవస్థానం బస్సుల్లో ఉచితంగా చేరవేస్తారు.



సింహాచలం ప్రధాన ద్వారం

భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం

సింహాచలంలోని తొలి పావంచా, అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకోవాలి.

దర్శన సమయాలు

శనివారం ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి ఆదేరోజు రాత్రి చేరుకునే భక్తులకు రాత్రి 10గంటల వరకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి. ఆదివారం ఉదయం 5.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేస్తారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు, రాత్రి 8.30గంటల నుంచి 9గంటల వరకు దర్శనాలు లభిస్తాయి.

రేపు ఆలయ ప్రదక్షిణలు

- ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సింహగిరి ఆదివారం ఆలయ ప్రదక్షిణలు జరగనున్నాయి. ఉదయం 3గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతిస్తారు. ఆలయ బాహ్య ప్రకారం చుట్టూ 400 మీటర్ల మేర ప్రదక్షిణ చేయాల్సి ఉంటుంది.
- అప్పుఘర్ వద్ద స్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం 40 తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరం, 80 ఎల్ఈడీ దీపాలు, ఒక జనరేటర్, ఒక పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. 20 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. వీరంతా పలు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించనున్నారు.



దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన

- మాధవధార వద్ద 40 తాత్కాలిక మరుగుదొడ్లు, ఒక వైద్య శిబిరం, 50 ఎల్ఈడీ దీపాలు, జనరేటర్‌ని అందుబాటులో ఉంచారు. ఒక పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు.
- కొండదిగువ, 29, కొండపైన 3 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించారు.
- 21న సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తులందరికీ నిర్విరామంగా కదంబం, దద్దోజనం అందజేస్తారు.
- సుమారు లక్ష లడ్డూలను విక్రయానికి సిద్ధం చేశారు.
- 21న జరిగే ఆలయ ప్రదక్షిణలకు సంబంధించి ఉత్తర రాజగోపురం వద్ద, దక్షిణ రాజగోపురం వద్ద వంతెలను ఏర్పాటు చేశారు. ఆ వంతెనల పై నుంచి ఆలయ ప్రదక్షిణలు చేసే భక్తులను, వంతెనల కింద నుంచి దర్శనాలకు అనుమతించనున్నారు.
- నగర సీపీ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసులు గిరి ప్రదక్షిణ బందోబస్తు నిర్వహించనున్నారు.
- **పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంలు ఏర్పాటు చేసే ప్రదేశాలు :** సింహాచలంలోని కొండదిగువ కలశం జంక్షన్, అడవివరం, హనుమంతవాక, అప్పుఘర్, మాధవధార, ఎన్ఎస్‌టీఎల్..

గిరి ప్రదక్షిణ మార్గంలో ఏదైనా అత్యవసర పరిస్థితిలో భక్తులు సంప్రదించాల్సిన నంబర్లు

సింహాచలం దేవస్థానం
0891-2954944, 9390501082
జీవీఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్
1800-42500009
వాటర్ సప్లై, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్
0891-2869111
విశాఖ పోలీస్
93901 05353, 93301 05355

2600 మందితో భద్రతా ఏర్పాట్లు

విశాఖ సిటీ: గిరి ప్రదక్షిణకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం 2600 పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నారు. శని, ఆదివారాలు జరిగే ఈ గిరిప్రదక్షిణలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బందోబస్తు అధికారులకు పలు సూచనలు చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది పూర్తి సమన్వయంతో గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులతో పాటు నగర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా వేడుక జరిగేలా విధులు నిర్వర్తించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–2 తుహిన్ సిన్హా, డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యం

టీచర్స్ కాలనీ (విశాఖ): సీఐఐ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం 'పరిశ్రమల్లో సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ'అనే అంశాలపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. పని చేసే ప్రాంతాల్లో ప్రమాదాలు, రిస్క్ అసెస్‌మెంట్, కంట్రోల్స్, క్లిష్టమైన ప్రక్రియపై ఈహెచ్ఎస్ మేనేజర్ ఎం.ఓం కుమార్ శిక్షణ ఇచ్చారు. ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాలను వివరించారు.

త్వరలో సొంత జిల్లాలకు తహసీల్దార్లు

మహారాణిపేట (విశాఖ): సార్వత్రిక ఎన్నికల ముందు బదిలీ అయిన తహసీల్దార్లు, ఇతర అధికారులను తిరిగి సొంత జిల్లాలకు పంపడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. శుక్రవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్లు స్థానికంగా ఉండరాదన్న నిబంధనతో ఈ ఏడాది జనవరి 31న విశాఖ నుంచి మొత్తం 19 మందిని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు బదిలీ చేశారు.

అలాగే అక్కడి నుంచి 19 మంది తహసీల్దార్లు విశాఖలో విధుల్లో చేరారు. విశాఖ నుంచి 9 మంది పార్వతీపురం మన్యం జిల్లాకు, 9 మంది విజయనగరం జిల్లాకు, ఒకరు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

మెడికల్‌షాపులో రూ.25 వేల నగదు చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం పోలీసులు

అనకాపల్లి : మండలంలో శారదానగర్ మెడికల్ దుకాణంలో గురువారం రాత్రి రూ.25వేలు నగదు చోరీకి గురైనట్టు పట్టణ పోలీస్‌లకు శుక్రవారం ఫిర్యాదు అందింది. పట్టణ సీఐ జి.శంకరరావు కథనం మేరకు వివరాలివి. శారదానగరలో శ్రీ లక్ష్మీగణపతి మెడికల్ దుకాణంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం షట్టర్ తొలగించి రూ. 25 నగదు చోరీకి పాల్పడినట్టు దుకాణ యజమాని కె.వి.వి.సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు. సంఘటన స్థలానికి క్లూస్ టీమ్ చేసుకుని వేలిముద్రల సేకరణ చేశారు.

థాయ్‌లాండ్‌కు ఐఆర్‌సీటీసీ టూర్ ప్యాకేజీలు

తాటిచెట్లపాలెం: ఉత్తరాంధ్ర జిల్లాల వారి కోసం విశాఖ నుంచి పలు అంతర్జాతీయ, జాతీయ విమాన ప్యాకేజీలను మొట్టమొదటిసారిగా ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి సావర్కర్ తెలిపారు.

టూర్‌ల వివరాలు..

మేజికల్ థాయ్‌లాండ్ : ఈ టూర్ మొత్తం ఐదు రాత్రులు, ఆరు పగళ్లు. సెప్టెంబరు 7వ తేదీన విశాఖలో మొదలై 12వ తేదీతో ముగుస్తుంది. ఇది విశాఖ నుంచి ప్రత్యేకంగా పరిచయం చేస్తున్న మొదటి అంతర్జాతీయ టూర్. ఈ ప్యాకేజీలో పట్టాయలో గల నాంగ్‌నూచ్ గార్డెన్, అల్కజర్ షో, కోరల్ ఐలాండ్, సఫారీ వరల్డ్ టూర్, రాత్రి భోజనంతో కూడిన రివర్ క్రూయిజ్, బ్యాంకాక్‌లో గల గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీ రాచ టైగర్ జూ వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. మొత్తం భోజనాలు, టిఫిన్స్, వసతి (4స్టార్ హోటల్), ఏసీ సైట్ సీయింగ్, ఇన్సూరెన్స్, అన్నింటితో కలిపి ఒకొక్కరికి 57,815/-(డబుల్, ట్రిపుల్ ఆక్యుపెన్సీ), రూ.66,735 (సింగిల్ ఆక్యుపెన్సీ)

సదరన్ డివైన్ టెంపుల్ టూర్

ఈ యాత్ర మొత్తం ఐదు రాత్రులు, ఆరు పగళ్లు ఉంటుంది. ఈ టూర్ ఆగస్టు 14వ తేదీన విశాఖలో ప్రారంభమై 19వ తేదీతో ముగుస్తుంది. ఈ టూర్‌లో దక్షిణాదిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురైలోని మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోడి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని శ్రీపద్మనాభ స్వామి ఆలయం వంటి దర్శనీయ స్థలాలను సందర్శించవచ్చు. ఈ టూర్‌లో ఒక్కొక్కరికి విమాన టికెట్లు, లోకల్ సైట్‌సీయింగ్, భోజనం, ఏసీ హోటల్ వసతి, ట్రావెల్ ఇన్సూరెన్స్, అన్ని కలిపి రూ. 38,005 (ట్రిపుల్, డబుల్ ఆక్యుపెన్సీ), రూ.39,880 (డబుల్ ఆక్యుపెన్సీ), రూ.51,400 (సింగిల్ ఆక్యుపెన్సీ)గా చార్జీలను నిర్ణయించారు. మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్రవేశద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ లేదా చందన్‌కుమార్–92810 30748, సాయిప్రసాద్– 92814 95847, కేవీ రావు–95501 66168 నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు కోరారు.

తేమను సద్వినియోగం చేసుకోండి

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు
- వర్షాల నేపథ్యంలో నారుమడి సంరక్షణపై రైతులకు సూచనలు

అనకాపల్లి : వరి వేసే రైతులు రాగల ఐదు రోజులలో వర్ష సూచన ఉన్నందున తేమను సద్వినియోగం చేసకుని ఎకరానికి 25–30 కిలోల విత్తనాన్ని 5 సెంట్ల నారుమడిలో విత్తుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొడి విత్తనం అయితే కిలో విత్తనానికి, కార్బెండజిమ్ 3 గ్రాములు, దంప నారుమడికి అయితే కిలో విత్తనానికి, కార్బెండజిమ్ ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున లేదా సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ కిలో విత్తనానికి గ్రాము కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని సూచించారు. 5 సెంట్లు నారుమడికి 6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 2.5 కిలో యూరియా 2 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను విత్తేముందు వేసుకోవాలని ఆయన కోరారు.

పొడతెగులు...

వరి నారుమడిలో, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున హెక్సాకొనజోల్ 2.0 మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చన్నారు.

కలుపు సమస్య

వరిలో వర్షాల కారణంగా కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందున, పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపు మందును ఎకరాకు 80–100 గ్రా. చొప్పున 20–25 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 4–7 రోజుల్లో వేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో జింకు/ఇనుము లోపం కనిపించే అవకాశం ఉన్నందున జింకు లోపల లక్షణాలు గమనించినట్టయితే 2 గ్రా. జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి 5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి, ఇనుము లోప లక్షణాలు గమనించినట్టయితే లీటరు నీటికి 20గ్రా. అన్నభేది, 2గ్రా. నిమ్మ ఉప్పు కలిపి 5 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారి చేయాలని ఆయన కోరారు.



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు

నేరుగా విత్తిన వరిలో కలుపు సమస్యలు....

నేరుగా వరి విత్తే పద్ధతిలో కలుపు సమస్య అధికంగా ఉంటుంది కనుక, కలుపు నివారణకు ఆలస్యంగా వేసిన వరిలో ప్రేటిలక్లో కలుపు మందును ఎకరానికి 600 మి.లీ.పెండిమిథాలి 38.7 శాతం సి.ఎస్. 700 మీ.లీ.చొప్పున వరి విత్తిన వెంటనే పిచికారి చేసుకోవాలని ఆయన సూచించారు. 20 రోజుల వరి పైరులో గడ్డి వెడాల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు, బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100 మి.లీ.ల చొప్పున పిచికారి చేయాలని, గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు ఫెనోక్సాప్రోప్‌పి ఇథైల్‌ను 350 మీ.లీ.లచొప్పున ఎకరా పొలంలో పిచికారి చేయాలి. 25–30రోజుల వయసుగల పైరులో వర్షాల వలన కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందున 2,4–డి అమైన్ సాల్టు 58శాతం ఇ.సి. 2 మీ.లీ. 10గ్రా..ల యూరియాను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి, లేనిచో ఆల్మిక్స్ కలుపు మందును ఎకరాకు 8 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆయన కోరారు. కలుపు తీసిన తరువాత పదును చూసుకుని మొదటి దఫా యూరియాను ఎకరాకు 23 కిలోల చొప్పున విత్తిన 15–20 రోజులకు వేసుకోవాలన్నారు.

వేరుశనగ : ఖరీఫ్‌లో వేరుశనగ వేసుకునే రైతులు రాగల వర్షాన్ని వినియోగించుకుని నేలను దున్ని, తయారు చేసుకుని కిలో విత్తనాన్ని 8 గ్రా..ట్రైకోడెర్మ విరిడితో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలని, వర్షాలను ఉపయోగించుకుని 18 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 34 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్‌ను విత్తేటప్పుడు వేసుకోవాలన్నారు. విత్తిన మూడు రోజులలోపు పెండిమితలిన్ అనే కలుపుమందును ఎకరానికి 1 లీటరు చొప్పున పిచికారి చేయాలని ఆయన కోరారు.

కరెంట్ సమస్యా...వాట్సప్ చేయండి



పర్యవేక్ష ఇంజనీర్ ఎల్.రవీంద్రనాథ్

చోడవరం రూరల్: ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు తీగలపై తెగిపడ్డాయా..? భారీ వర్షాలకు విద్యుత్తు స్తంభాలు వంగి ప్రమాదకరంగా మారాయా?.. ఈ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తుంటుంటే కలవడం లేదా...అయితే మీ కోసమే విద్యుత్ శాఖ అధికారులు వినూత్నంగా ఆలోచించి, ఆచరణలో పెట్టారు. ఇందు కోసం ప్రత్యేకంగా వాటప్స నంబర్ కేటాయించారు.పై విద్యుత్తు సమస్యలు ఏవైనా సరే వాటప్స చేస్తే పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు భరోసా ఇస్తున్నారు.

విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతోపాటు పాడేరు ఐటీడీఏ పరిధిలో తలెత్తితే ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్లతోపాటు అదనంగా వాట్సప్ నంబర్ సదుపాయాన్ని విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.రవీంద్రనాథ్ కల్పించారు. 7382249881 నంబరు గల వాట్సప్‌కు సమస్యలు తెలియజేస్తే తక్షణ పరిష్కారం చూపిస్తామని ఆయన స్పష్టం చేశారు. వర్షాల కారణంగా అధిక సంఖ్యలో ఏర్పడే సమస్యల పరిష్కారం కోసం ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ పరిధిలో ఆయా విద్యుత్ జోన్ల వారీగా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. జోన్ల వారీగా కంట్రోల్ రూమ్‌లలో ఏర్పాటు చేసిన మొబైల్ నంబర్లను ఆయన తెలియజేశారు. విశాఖపట్నం సర్కిల్‌కు 7382249881, డివిజన్ ఆఫీస్ జోన్–1 కంట్రోల్ నంబర్ 9490610018, జోన్–2కు 9490610020, జోన్–3కు 9491030721 టోల్ ఫ్రీ నంబర్లను కేటాయించినట్టు చెప్పారు. అనకాపల్లి డివిజన్‌కు 9490610022, కశింకోట డివిజన్‌కు 7382249866, నర్సీపట్నం డివిజన్‌కు 9491030714, పాడేరు డివిజన్‌కు 9490610026 నంబర్లకు కాల్ చేసి ఆయా పరిధుల్లోని వినియోగదారుల తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని ఈఈ తెలిపారు. ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఏడీఈ ఉప్పలూరి కుమార్ గౌరీ ప్రసాద్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

క్లుప్తంగా

బొజ్జన్నకొండ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

అనకాపల్లి: మండలంలోని శంకరం పంచాయతీలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ అభివృద్ధి పనులను ఈ ఏడాది కార్తీకమాసంలోగా పూర్తిచేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సుమారు రూ.15 కోట్ల నిధులతో ప్రారంభించిన అభివృద్ధి పనులు రెండేళ్లుగా కొనసాగుతున్నాయని, ఇటీవల పనుల్లో జాప్యం నెలకొందన్నారు. ప్రజాప్రతినిధులు, పురాతత్వశాఖ అధికారులు, కలెక్టర్ దృష్టి సారించి అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయాల్సిందిగా కోరారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే దేశ విదేశాల నుంచి వేలాది మంది పర్యాటకులు, బౌద్ధ భిక్షువులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. జిల్లా చరిత్ర ప్రపంచానికి తెలుస్తుందన్నారు.

ఆకుకూరలతో కంటి ఆరోగ్యం భద్రం



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా పదో అదనపు న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి: నిర్ణీత వయసు దాటిన వారు ఏటా కంటి పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచన మేరకు కంటి అద్దాలను వాడాలని జిల్లా పదో అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు, న్యాయవాదులకు వేద నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఐకేర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నిత్యం ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం వలన కంటి సమస్యల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎ.రమేష్, విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎన్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, ఉపాధ్యక్షులు రోజా, సహాయకార్యదర్శి తులసి, వైద్యుడు జి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహం

మునగపాక : స్థానిక సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న ఏకాహం శుక్రవారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా వారం రోజుల పాటు ఏకాహం నిర్వహించడంలో భాగంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని భజనలు, కీర్తనలు ఆలపించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 16 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,290	5,290
రెండో రకం	--	--
మూడోరకం	3,550	3,550

అనకాపల్లి సినిమాలు

పేకమేడలు	: రాజా
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-2
డార్లింగ్	: షిర్డిసాయి
భారతీయుడు 2	: పర్తిసాయి
క్రైం రీల్	: వెంకటేశ్వర
నరబలి	: శ్రీసత్య
ద బర్త్‌డే బోయ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 97 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-36 యూనిట్లు, ఓ పాజిటివ్-46 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 219 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 95 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీరు



శంకరం వద్ద నిండుగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ



నీట మునిగిన కశింకోట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం

తెరిపివ్వని వర్షం.. స్తంభించిన జనజీవనం

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గ పరిధి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. రోడ్లు, కాల్వలు పొంగిపొర్లాయి. సాధారణ జన జీవనం స్తంభించింది. కలెక్టర్ ఆదేశాలతో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ప్రస్తుత వర్షాలు ఖరీఫ్ వరి సాగుకు అనుకూలమని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింతగా వర్షాలు కురిస్తే మాత్రం నారు మడులు నీటి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునేవారు దిగాలుపడ్డారు.

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- ఖరీఫ్ వరి నారు మడులకు అనుకూలం
- మరో రెండు రోజులు కురిస్తే తప్పదు నష్టం
- రైతుల్లో ఓ వైపు ఆనందం.. మరోవైపు ఆందోళన



ఎన్టీఆర్ క్రీడామైదానం రహదారిలో కురుస్తున్న వర్షం



వేల్పులవీధి జంక్షన్ వద్ద ఎల్లయ్య కాలువ పరిస్థితి



శారదానదిలో వర్షపు నీటి ప్రవాహం



గాంధీబొమ్మ జంక్షన్ నుంచి పెరుగుబజార్ రహదారి పరిస్థితి



కశింకోటలోని పంట భూముల్లో చేరిన నీరు

అనకాపల్లి/తుమ్మపాల/కశింకోట: అల్పపీడన ప్రభావంతో పట్టణ, మండలాల్లోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా తెరిపివ్వకుండా వానలు కురుస్తున్నాయి. అనకాపల్లి పట్టణం, మండల పరిధిలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు 73.4 మి.మీ. వర్షపాతం నమోదయింది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. రహదారులు గోతులమయంగా మారాయి. పట్టణ పరిధిలో ప్రధాన కాలువలతో పాటు, వీధుల్లోని డ్రైనేజీల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడంతో తాజా వర్షాలకు చెత్తా చెదారం రోడ్లపైకి చేరింది.

- శ్రీరామ్‌నగర్, లక్ష్మీదేవిపేట, రింగ్‌రోడ్డు, శారదా కాలనీ, అంబేద్కర్‌నగర్, పూల్‌బాగ్‌రోడ్డు, నూకాంబిక అమ్మవారి రహదారి, గవరపాలెం పార్కుసెంటర్‌ వర్షంతో తడిసి ముద్దయింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీరు ప్లాట్‌ఫాం మీదికి రావడంతో ప్రయాణికులు, గ్యారేజీలో బస్సులకు మరమ్మతులు చేసే ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.
- అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రహదారిలో విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో చోడవరం వెళ్లే బస్‌లు, ఇతర వాహనాలను లక్ష్మీదేవిపేట రైల్వే గేటు మీదుగా ట్రాఫిక్ పోలీసులు మళ్లించారు. జీవీఎంసీ అధికారులు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీటిని ఎప్పటికప్పుడు విద్యుత్ మోటార్‌తో శారదానదిలోకి పంపిస్తున్నారు.
- రహదారులకు ఇరువైపులా తోపుడుబళ్లపై వ్యాపారాలు చేసుకునే వర్తకులు, కూరగాయల వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.
- మరో రెండు రోజులపాటు ఇలాగే వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు వేసిన నారుమడులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.
- మండలంలో అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి, గోపాలపురం, గొలగాం, సీహెచ్‌ఎన్ అగ్రహారం, వెంకుపాలెం, కొత్తూరు గ్రామాల్లో రైతులు పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలకు నష్టం వాటిల్లకుండా రైతులు వర్షపు నీటిని సాళ్లుకట్టి దిగువ ప్రాంతానికి వదులుతున్నారు.
- శారదానదిలో భారీగా వర్షపు నీరు ప్రవహిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శారదానది ఉధృతంగా మారింది.
- అనకాపల్లి సుంకరమెట్ట జంక్షన్ నుంచి జలగలమదుం హైవేలో సుమారు 2 కిలో మీటర్ల రహదారిలో పెద్దపెద్ద గొతులు ఏర్పడి, వర్షపు నీరు చేరింది. దీంతో అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లే బస్‌లు, భారీ లారీలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.
- దాదాపు అన్ని గ్రామాల్లో పాడిపశువులు పాకలకే పరిమితమయ్యాయి. దీంతో వీటికి మేత అందించేందుకు రైతులు కష్టపడాల్సి వచ్చింది. పాల దిగుబడి తగ్గడంతో పాట బురదగా మారిన కల్లాల్లోనే పశువులు ఉండటంతో జడుపులు వచ్చి, అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కశింకోటలో..

మండలంలో రెండు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలను అతలాకుతలం చేశాయి. ప్రధానంగా వరి రైతులకు మేలు చేశాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నుంచి శుక్రవారం ఉదయానికి 60.6 మి.మీ., ఉదయం నుంచి సాయంత్రం 4 వరకు 34.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

- కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోడ్డు నీట మునిగింది. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నీరు చేరింది. వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి. భారీ వర్షాలు కావడంతో చెరువును తలపించేలా నీరు చేరింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. నీరు పోయేందుకు నిర్మించిన కాలువ తుప్పలు, చెత్తాచెదారంతో నిండి, చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోతోంది. దీంతో పీహెచ్‌సీకి రాకపోకలు సాగించే రోగులు, మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే వారికి ఇక్కట్లు తప్పనిసరయ్యాయి.
- తాళ్లపాలెం కూడలిలో వర్షం నీరు చేరడంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది చెందారు. భారీ వర్షాల వల్ల మండలంలో పలుచోట్ల పంట భూములు, వరి నారుమళ్లు నీట మునిగాయి. అయితే ఇప్పటి వరకు కురిసిన వర్షాలు ఖరీఫ్ వరి సాగుకు ఉపకరిస్తాయని, మరింతగా కురిస్తే నారు మళ్లు దెబ్బతినే ప్రమాదముందని రైతులు చెప్తున్నారు.



కశింకోటలో వరి నారుమడిలో చేరిన వర్షపు నీరు

ఈ వర్షాలతో రైతులకు మేలు

భారీ వర్షాలు ఖరీఫ్ సీజన్ వరి సాగు రైతులకు మేలు చేస్తాయి. నారు పెరుగుదలతోపాటు, నాట్లకు కూడా ఈ వానలు దోహదపడతాయి. వరి నారుపై చీడపీడల నివారణ, సాగు భూములు దున్నుకోవడానికి, చెరకు తోటలకు ఈ వర్షం ఎంతగానో ఉపకరిస్తుంది. ఇవే వర్షాలు ఇదే స్థాయిలో మరో రెండు రోజులు కురిస్తే రైతులు అప్రమత్తంగా ఉండాలి. నారు మడుల్లో నీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు సిద్ధమవ్వాలి.

– ఎం.స్వప్న, మండల వ్యవసాయాధికారి, కశింకోట

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



ప్రభుత్వాలు మారుతున్నా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయట్లేదు. చిన్నపాటి వర్షం కురిసినా రహదారుల్ని ముంచెత్తుతున్నాయి. అనకాపల్లి రైల్వే స్టేషన్ రహదారి పనులు నేటికీ పూర్తి చేయకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదు. డ్రైనేజీలో అక్కడక్కడ పూడికతీసినా వాటిని రోడ్డుపైనే ఉంచేస్తున్నారు. దీంతో వర్షాలు పడుతున్న సమయంలో మళ్లీ ఆ పూడిక డ్రైనేజీలోకి జారిపోతోంది.

– శ్రీనివాసరావు, అనకాపల్లి

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవస్థానంలో గౌరీపరమేశ్వరుల 194వ ఊంజల్ సేవను శుక్రవారం అలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయిలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని సూరిశెట్టి శంకర్ కిషోర్, ఉష దంపతులచే జరిపారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, గౌరీ గీతా మహిళా మండలి వ్యవస్థాపకురాలు పెతకంశెట్టి సుజాత, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెంకన్నకు చక్రాబ్జ మండలార్చన



వేంకటేశ్వరస్వామి ఆలయంలో చక్రాబ్జ మండలార్చన చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని స్థానిక దేమునిగుమ్మం అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబుల ఆధ్వర్యంలో స్వామి వారి చక్రాబ్జ మండలార్చన చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాజసులోచన, అర్చకులు ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



బకాయి జీతాలు చెల్లించాలని రిలే దీక్షలు చేస్తున్న మత్తు వ్యసన విముక్తి విభాగ కాంట్రాక్ట్ ఉద్యోగులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటుచేసిన మత్తు వ్యసన విముక్తి విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ 8వ రోజైన శుక్రవారం భారీ వర్షంలోనూ గొడుగులు వేసుకుని దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 12 నెలలుగా జీతాల్లేకపోవడంతో కుటుంబ జీవనానికి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సెంట్రల్ బడ్జెట్ రిలీజ్ చేయించే విషయంలో చొరవ తీసుకుని, జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న 25 డ్రగ్ డి అడిక్షన్ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వ నేతలు ఇన్ని రోజులైనా తమ సమస్యల పట్ల స్పందించి, ఒక్కసారి కూడా దీక్షా శిబిరం వద్దకు వచ్చి, పరిశీలించకపోవడం అన్యాయమన్నారు. దీక్షా శిబిరంలో ఉద్యోగులు ఎస్.క్రాంత్‌కుమార్, బి.నాయుడుబాబు, జి.కీర్తన, జి.రాజ్యలక్ష్మి, ఎల్.శ్రీదేవి, చంద్రశేఖర్, ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని వినతి

పరవాడ: పారిశ్రామికవాడగా గుర్తింపు పొందిన పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. పరవాడలో శుక్రవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, ఇండస్ట్రియల్ పార్క్‌లోని పరిశ్రమలలో సుమారు 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని వివరించారు. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీని తెరవకుండానే మూసివేశారన్నారు. కార్మికులకు ఎలాంటి అనారోగ్యం వచ్చినా పట్టణ ప్రాంతాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆర్థిక భారం పడుతుందన్నారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి పరవాడలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

సీఎస్సార్ కార్యక్రమాలు విస్తృతం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో రూ.19 లక్షలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇన్నోవేషన్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎన్టీపీసీ సేవలు అవసరమన్నారు. విద్య, వైద్యం, తాగు నీరు, రహదారులు వంటి సదుపాయాల కల్పనపై యాజమాన్యం దృష్టి సారించాలని సూచించారు.

ప్రభుత్వ ఐటీఐలో మెగా జాబ్ మేళా



జాబ్ మేళాకు హాజరైన రెండు జిల్లాల అభ్యర్థులు

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలలో కోర్సు పూర్తి చేసిన నిరుద్యోగులు హాజరైనట్లు తెలిపారు. 156 మంది అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరైనట్లు వెల్లడించారు. 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించి 116 మందిని ఎంపిక చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీఐ ట్రెనింగ్ అధికారి, యు.ఎస్.ఎన్. మూర్తి పాల్గొన్నారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు



దుర్గమాంబ ఆలయంలో మహిళల కోలాటం

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళల కోలాటాలు విశేషంగా అలరించాయి. భక్తి గీతాలు ఆలపిస్తూ భజన చేశారు.

విద్యుత్ ఉపకరణాలతో జాగ్రత్త

ఎస్.రాయవరం : తుపాను సమయాల్లో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ సూచించారు. ఇళ్లలో గృహోపకరణాలు స్విచ్ ఆఫ్‌లో పెట్టాలన్నారు. చినపిల్లలను కరెంటు వస్తువులు తాకనీయకుండా చూడాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ స్తంభాల స్టే వైర్లు తాకకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడయిన వైర్లు తెగిపడినా వెంటనే విద్యుత్ కేంద్రాలకు సకాలంలో సమాచారం ఇవ్వాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

పాయకరావుపేట : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తపడాలని నర్సీపట్నం డీఎల్‌పీవో జీఎస్ఎస్ఎన్ మూర్తి అన్నారు. పట్టణంలో గల ఇందిరా కాలనీ అంగన్‌వాడీని పరిశీలించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందితో కలిసి అంగన్‌వాడీ టీచర్లకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈయనతో పాటు ఈవోఆర్డీ సిహెచ్ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధ్వానంగా ఎన్టీపీసీ రోడ్డు



గోతులమయంగా వెన్నలపాలెం-ఎన్టీపీసీ రోడ్డు

పరవాడ: వెన్నలపాలెం-ఎన్టీపీసీ రహదారి శిథిలావస్థకు చేరింది. దీంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనచోదకులు, ఉద్యోగులు, కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. తంతడి రోడ్డు నుంచి రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన వెన్నలపాలెం రహదారి గుంతల మయంగా మారింది. రోడ్డు అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరుకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కృషి చేయాలని గ్రామ ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు కోరారు.

మునగపాకలో వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక : ప్రతి వాహనదారుడు రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు వహించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. వాహన తనిఖీల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆయన మునగపాక మెయిన్‌రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపినా అలాగే హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినా చర్యలు తప్పవన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. అలాగే అతివేగం అత్యంత ప్రమాదకరమన్నారు. ఆయన వెంట ఏఎస్ఐలు మన్మదరావు, రామకృష్ణ,దేవన్న తదితరులు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లు ప్రదర్శిస్తున్న మూలపేట గ్రామస్తులు

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రమణి కోరారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం 104 సేవలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఆడారి జగన్నాథరావు, ఈశ్వర అప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమానికి ముందు గ్రామంలో ఆరోగ్య సూత్రాలకు సంబంధించి పోస్టర్ల ప్రదర్శన నిర్వహించారు.